సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



**వలస కూలీలకు ఉపాధి**
వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్నారు. - 9లో



**సాగు నీరందిస్తాం**
ధర్మారెడ్డిపల్లి కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. - 9లో



**పరిశుభ్రత అందరి బాధ్యత**
పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. - 9లో

## న్యూస్‌రీల్

### రేపటి నుంచి పదోన్నతుల ప్రక్రియ

భువనగిరి: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. 2వ తేదీన వెబ్‌సైట్‌లో ఖాళీల ప్రదర్శన, 3న సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 4న అభ్యతరాలను పరిశీలించి తుది జాబితా విడుదల చేస్తారు. 6న వెబ్ అప్షన్ల అమలు (గ్రేడ్–2 హెచ్‌ఎంలకు), 8న ఎస్‌జీటీల తుది జాబితా విడుదల, 10న ఎస్‌జీటీల వెబ్‌ఆప్షన్‌లు వెల్లడించనున్నారు. 11న స్కూల్ అసిస్టెంట్‌లు, 12న ఎస్‌జీటీల పదోన్నతులకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. జిల్లాలో 2,939 మంది ఉపాధ్యాయులు ఉండగా 200 మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉంది.

### మాతృ మరణాలకు తావుండొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మనోహర్

భువనగిరి: మాతృ మరణాల నిర్మూలనకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ మనోహర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాతృ మరణాల జిల్లా ఉప కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైరిస్క్ గర్భిణుల్లో రక్త హీనత, హైబీపీ వంటి సమస్యలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాతృ మరణాల నిర్మూలనకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించనుందని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు యశోద, శిల్పిని, ఇందిరామణి, సాయిరమణి తదితరులు పాల్గొన్నారు.

### అన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్‌లు



ఆలేరు బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులతో డీఈఓ సత్యనారాయణ

ఆలేరు: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని డీఈఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ యూనిట్‌ను సందర్శించారు. ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ఈ విభాగాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ ఎర్రలక్ష్మి, హెచ్‌ఎం దాసరి మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి నరేంద్రస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



అలంకరణలో స్వామివారు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్యారాధనలు శాస్త్రరుక్తంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవ, అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ప్రాకారా మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు. స్వామి వారికి రూ.19,89924 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకటరావు తెలిపారు.

# భూసేకరణే ప్రధాన సమస్య!

## మూసీ కాలువల ఆధునీకరణకు అడ్డంకి ఇదే..

- పరిహారం పెంచాలంటున్న రైతులు
- భూములు ఇవ్వడానికి విముఖత, పనుల అడ్డగింత
- ఆటంకాలను తొలగించేందుకు కార్యాచరణ
- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల పర్యటన
- రైతులను ఒప్పించి కాలువల పనులు ముందుకు తీసుకెళ్లేయత్నం



రైతులు అడ్డుకోవడంతో మక్తాఅనంతారం వద్ద నిలిచిపోయిన బునాదిగాని కాలువ పనులు

సాక్షి,యాదాద్రి: మూసీ కాలువల ఆధునీకరణకు భూ సేకరణ ప్రధాన సమస్యగా మారింది. భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో భారీగా పలుకుతున్నందున అదే స్థాయిలో పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అడ్డంకులు తొలగించి ఆధునీకరణ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

**నేటినుంచి రైతులతో సమావేశాలు ..** ఉమ్మడి జిల్లాకు లబ్ధి చేకూరేలా బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల విస్తరణకు అవసరమైన భూసేకరణ చేయటానికి రెవెన్యూ యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. అయితే భూములు సేకరించాల్సిన బాధ్యతను ప్రభుత్వం ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌పై మోపింది. దీంతో వారు రైతులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి పరిహారంపై చర్చలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు. శుక్రవారం వలిగొండ మండల రైతులతో అధికారులు సమావేశం కానున్నారు.

**66 కి.మీ పొడవు పిలాయిపల్లి కాలువ**
రంగారెడ్డి జిల్లా బండరావిర్యాల నుంచి భువనగిరి జిల్లా మీదుగా నల్లగొండ జిల్లా ఉరుమడ్ల గ్రామం వరకు 66 కిలో మీటర్ల పొడవు పిలాయిపల్లి కాలువను ఆధునీకరించనున్నారు. బండరావిర్యాల నుంచి భూదాన్‌పోచంపల్లి మండలం మైసమ్మ కత్వ వరకు ఏడు మీటర్లు, అక్కడినుంచి చిన్నకోడూరు వరకు ఆరు మీటర్లు, అక్కడి నుంచి ఉరుమడ్ల వరకు 5 మీటర్లు కాలువను వెడల్పు చేయనున్నారు.భూ సేకరణకు రూ.86.22 కోట్లు అవసరం కాగా.. ప్రస్తుతం రూ.8 కోట్లు సిద్ధంగా ఉన్నాయి.

**ధర్మారెడ్డి కాలువ..**
ధర్మారెడ్డిపల్లి నుంచి నార్కట్‌పల్లి మండలం లింగోటం వరకు 66 కిలో మీటర్ల మేర ధర్మారెడ్డి కాలువను ఆధునీకరించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.123.98 కోట్లు మంజూరు చేసింది. కాలువ విస్తరణకు అవసరమైన భూసేకరణ మొదలైంది. అయితే పలు ప్రాంతాల్లో రైతులు భూములిచ్చేందుకు అంగీకరించడం లేదు.ప్రభుత్వం ఇస్తానంటున్న పరిహారం సరిపోదని, పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### బునాదిగాని కాలువకు 350 ఎకరాలు అవసరం



మక్తాఅనంతారం సమీపంలో బునాదిగాని కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బీబీనగర్ మండలం మక్తా అనంతారం నుంచి మోత్కూరు మండలం ధర్మారం వరకు 98.64 కిలో మీటర్ల మేర బునాదిగాని కాలువను ఆధునీకరించనున్నారు. ప్రారంభంలో 6 మీటర్లు, ఆ తరువాత 5, 4 మీటర్ల మేర కాలువను వెడల్పు చేయనున్నారు. భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని 32 గ్రామాల్లో సుమారు 350 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ఇప్పటికే రూ.269 కోట్లు మంజూరు చేసింది. భూ సేకరణకు సంబంధించి ప్రస్తుతం రూ.10 కోట్లు సిద్ధంగా ఉన్నాయి. అయితే బహిరంగ మార్కెట్ రేట్ ఎక్కువగా ఉన్నందున పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే కారణంతో మక్తా అనంతారం వద్ద బునాదిగాని కాలువ పనులను రైతులు అడ్డుకున్నారు.

### వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం

మూసీ కాలువల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే ప్రయత్నంలో ఉన్నాం. ఇప్పటికే బీబీనగర్ మండలం మక్తా అనంతారం నుంచి బునాదిగాని కాలువ పనులు ప్రారంభించాం. కొన్ని చోట్ల రైతులు పరిహారం పెంచాలని అడుగుతున్నారు. ప్రభుత్వంతో చర్చించి ఎక్కువ పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తాం. – అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే



భువనగిరిలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పింఛన్‌కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

# కొత్త విధానం.. కష్టాలు అదనం

- ఫేస్ రికగ్నేషన్‌తో సాంకేతిక సమస్యలు
- మిత్ర యాప్‌లో అప్‌లోడ్ కాని ఫొటోలు
- సైట్ సమస్య అంటున్న పోస్టల్ సిబ్బంది



భువనగిరిలోని సమ్మద్ చౌరస్తా పోస్టాఫీస్‌లో మిత్ర యాప్‌తో లబ్ధిదారుల ఫొటో తీస్తున్న సిబ్బంది

భువనగిరిటౌన్ : చేయూత పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫేస్ రికగ్నేషన్ విధానం ద్వారా కొత్త చిక్కులు తలెత్తుతున్నాయి. ఒక్కో లబ్ధిదారు ఫొటోను మిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి 15 నిమిషాలకు పైగా సమయం తీసుకుంటుంది. ఒక్కోసారి సైట్ ఓపెన్ కాకపోవడం, నెట్ సిగ్నల్స్ అందకపోవడం, లబ్ధిదారుల ఆధార్ వివరాలు అప్‌డేట్ కాకపోవడం వంటి సమస్యల కారణంగా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా పోస్టల్ సిబ్బందికి ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేయకపోవడంతో సెల్‌ఫోన్‌లలో మిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లబ్ధిదారుల పాటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు సరిగా పనిచేయకపోవడం కూడా సమస్యకు కారణమవుతోంది. గురువారం భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం మండలాల్లోని పోస్టల్ కార్యాలయాల్లో ఇటువంటి సమస్యలే ఎదురయ్యాయి. దీంతో లబ్ధిదారులు పొద్దస్తమానం పడిగాపులు కాయక తప్పలేదు. చాలా మంది లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్లారు. మరోవైపు తాగు నీరు, నీడ సౌకర్యం కూడా లేకపోవడంతో వృద్ధులు అవస్థలు పడ్డారు.

### మూడు రోజులుగా తిరుగుతున్న

పింఛన్ కోసం మూడు రోజుల నుంచి పోస్టాఫీస్‌కు వచ్చిపోతున్న. సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. పాత విధానమే బాగుంది. – తాళ్ల పద్మ, జలాల్‌పూర్



ఆలేరులోని పోస్టాఫీస్ వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

# ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచండి

- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్



నాగినేనిపల్లిలో ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీస్తున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

బొమ్మలరామారం,బీబీనగర్, తుర్కపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పనుల్లో వేగం పెంచాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ అధికారులను ఆదేశించారు.బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపలి, మేడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత స్థలంలోనే ఇళ్లు నిర్మించుకోవాలని, విస్తీర్ణం పెరిగితే అదనపు ఖర్చుతో భారంగా మారుతుందని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో హౌసింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని మందలించారు. ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ లబ్ధిదారులకు సహకరించాలని స్పష్టం చేశారు. నాగినేనిపల్లిలో చిక్క సరోజన, గొట్టిముక్కుల రాజమ్మకు మంజూరైన ఇళ్ల నిర్మాణానికి చేయూతనిచ్చిన నాయకుడు రామిడి జంగారెడ్డిని ఎండీ గౌతమ్ అభినందించారు. అదే విధంగా బీబీనగర్ కొండమడుగు గ్రామం, తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ వ్యయంపై లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించలేదని కొండమడుగు గ్రామంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేయకుండా లబ్ధిదారులకు ఇసుక, ఇతర మెటీరియల్ సమకూర్చాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్, మండల నోడల్ అధికారి జ్యోతికుమార్, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, డీఈ శ్రీరాములు, ఏఈ రోహిత్, పంచాయతీ కార్యదర్శులు నవీన్, గణేష్ తదితరులు ఉన్నారు.

### 115 మంది బాల కార్మికుల గుర్తింపు

భువనగిరి : బాలకార్మికులను గుర్తించేందుకు జూలై 1న వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించి ఆపరేషన్ ముస్కాన్ గురువారం ముగిసింది. భువనగిరి డివిజన్ పరిధిలో 115 మంది బాలకార్మికులను అధికారులు గుర్తించారు. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు తల్లిండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడీడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అందాలు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసచారి, కానిస్టేబుల్స్ హరీష్, సురేష్, భవానీ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకూ ఫేస్ రికగ్నేషన్ హాజరు

- ప్రభుత్వ స్కూళ్లలో నేటి నుంచి అమలు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నేషన్ హాజరు విధానం అమల్లోకి రానుంది.గత ఏడాది నుంచి విద్యార్థులకు అమలు చేస్తుండగా.. ఈ విద్యా సంవత్సరం ఉపాధ్యాయులకు వర్తింపజేయనున్నారు. ముఖ హాజరు ద్వారా ఉపాధ్యాయుల హాజరు పారదర్శకంగా ఉండనుంది. గురువారం ప్రధానోపాధ్యాయుల సెల్‌ఫోన్‌లలో ఫేస్ రికగ్నేషన్ యాప్ అప్‌లోడ్ చేశారు. జిల్లాలోని 715 పాఠశాలల్లో 2,939 మంది ఉపాధ్యాయులు, 139 మంది ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. వీరంతా శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు వేయనున్నారు.

# తరగతులు ఐదు.. గది ఒక్కటే!



బీసీ కమ్యూనిటీ హాల్‌లోని ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులు



తరగతి గదిలోనే ఒక వైపు విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట చేసిన దృశ్యం

తుర్కపల్లి: ఒకటి నుంచి 5వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు. అందరికీ ఒకటే గది. ఉపాధ్యాయులు ఇద్దరు ఉండగా ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఐదు తరగతుల బోధన బాధ్యతలు హెచ్‌ఎంపైనే పడ్డాయి. ఆయన విద్యాశాఖ నిర్వహించే సమాశాలకు వెళ్లే ఆ రోజు పాఠశాల మూసివేస్తారు. ఈ గదిలోనే మధ్యాహ్న భోజనం చేస్తారు. వంట సామగ్రి సైతం ఇందులోనే భద్రపరుస్తారు.. తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇదీ. పాఠశాల పాత భవనాన్ని కూలగొట్టి నూతన భవనం నిర్మిస్తున్నారు. భవనం పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో బీసీ కమ్యూనిటీ హాల్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

# నిబద్ధతతో పనిచేసినప్పుడే గుర్తింపు



బీసీ సంక్షేమ అధికారి యాదయ్యను సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు

భువనగిరిటౌన్ : ఉద్యోగులు నిబద్ధతో పనిచేసినప్పుడే గుర్తింపు ఉంటుందని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు పనిచేసే చోట చిత్తశుద్ధితో వ్యవహరించి మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని సూచించారు. వీలైనంత వరకు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి యాదయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఓల సంఘం రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్, టీజీఓ సభ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో 324 ఖాళీలు

**నాలుగేళ్లుగా భర్తీ కాని పోస్టులు**
- సిబ్బంది కొరతతో మూతపడుతున్న కేంద్రాలు
- జిల్లాలో 28 సెంటర్లు మూసివేత



ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది లబ్ధిదారులు ఉండేవారు. అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్, వృద్ధాప్యంతో ఆయా మృతి చెందారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. దీంతో మోదుబావిగూడెం అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌ను ఇంచార్జ్‌గా నియమించారు. ఆమె పది రోజులకు ఒకసారి పోతిరెడ్డిపల్లికి వచ్చి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేసి వెళ్తుంది. మిగతా రోజుల్లో కేంద్రం మూసి ఉంటుంది.



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు 16, గర్భిణులు నలుగురు ఉండేవారు. కేంద్రంలో పని చేస్తున్న ఆయా అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో రెండేళ్ల నుంచి అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ కేంద్రం నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. పిల్లలకు చదువు చెప్పడంతో పాటు కేంద్రాన్ని ఊడ్చటం, పిల్లలకు వంట చేయటం, పౌష్టికాహారం పంపిణీ వంటి పనులన్నీ తానే చేస్తుంది. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పిల్లలకు భద్రత కల్పించడానికి స్వయంగా నెలకు రూ. 600 చెల్లిస్తూ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుంది.

ఆత్మకూరు(ఎం): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అండగా నిలుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక చోట్ల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. కొన్ని చోట్ల సమీప గ్రామాల కేంద్రాల టీచర్లను ఇంచార్జ్‌లుగా నియమించగా, మరికొన్ని చోట్ల తెరిచేవారు లేక మూతపడ్డాయి. జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 841 అంగన్‌వాడీ కేంద్రాలు.. వాటి పరిధిలో టీచర్ 58, ఆయా పోస్టులు 266 ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల 28 కేంద్రాలు మూతపడ్డాయి. ఖాళీ పోస్టులను సుదీర్ఘకాలంగా భర్తీ చేయకపోవడంతో పలు గ్రామాల్లో కేంద్రాలు తెరిచేవారు లేకుండా పోయారు. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాలు మూత పడటంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందడం లేదు.

**రామన్నపేట ప్రాజెక్టు పరిధిలో..**
రామన్నపేట ప్రాజెక్టు పరిధిలో 219 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. టీచర్ 16, ఆయా పోస్టులు 97 ఖాళీ ఉన్నాయి. సిబ్బంది లేమితో 10 కేంద్రాలు మూతపడ్డాయి.

**భువనగిరి పరిధిలో..**
భువనగిరి పరిధిలో 267 కేంద్రాలు నడుస్తున్నాయి. టీచర్ 4, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లు, ఆయాలు లేనిచోట ఇంచార్జ్‌లతో నడిపిస్తున్నారు.

**మోత్కూరు..**
మోత్కూరు ప్రాజెక్టు పరిధిలో 136 కేంద్రాలు నడుస్తున్నాయి. టీచర్లు 32, ఆయా పోస్టులు 63 ఖాళీ ఉన్నాయి. టీచర్లు, ఆయాలు లేకపోవడంతో 15 కేంద్రాలు మూతపడ్డాయి. బాలింతలు 285 మంది, గర్భిణులు 359, చిన్నారులు 2,934 మంది ఉన్నారు.

**ఆలేరు..**
ఆలేరు ప్రాజెక్ట్ పరిధిలో 219 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. టీ చర్లు 6, ఆయా పోస్టులు 56 ఖాళీ ఉన్నాయి. 3 కేంద్రాలు మూతపడ్డాయి. బాలింతలు 1,061, గర్భిణులు 1,031, చిన్నారులు 10,566 మంది నమోదై ఉన్నారు.

### త్వరలోనే భర్తీ చేస్తాం

అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ వేస్తాం. సిబ్బంది లేనిచోట లబ్ధిదారులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యామ్నా ఏర్పాట్లు చేశాం. పక్క గ్రామం అంగన్‌వాడీ టీచర్‌తో పౌష్టికాహారం అందజేస్తున్నాం. ఖాళీల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశాం. – నరసింహారావు, ఐసీడీఎస్ పీడీ

### మూతపడి నాలుగేళ్లవుతుంది



మా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం మూత పడి నాలుగు సంవత్సరాలు అవుతుంది. పక్క గ్రామం నుంచి అంగన్‌వాడీ టీచర్ పోషకాహారం అందజేసి వెళ్తుంది. టీచర్‌ను, ఆయాను నియామకం చేసి కేంద్రాన్ని తెరిస్తే పిల్లల్ని పంపిస్తారు. –లోడి ఉమ, కామునిగూడెం, ఆత్మకూర్(ఎం)

### ప్రైవేట్ మనిషిని నియమించాం



రెండేళ్ల నుంచి ఆయా పోస్టు ఖాళీ ఉంది. భర్తీ చేయకపోవడంతో అన్ని పనులు నేనే చేయాల్సి వస్తుంది. కోతుల బెడద ఉంది. పిల్లలు భయపడుతున్నారని కాపలా కోసం సొంత డబ్బులతో ప్రైవేట్ వ్యక్తిని నియమించుకున్న. –మంగమ్మ, అంగన్‌వాడీ టీచర్,రహీంఖాన్‌పేట

### 2021 నుంచి ఆయా లేదు



గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 8 మంది చిన్నారులు, ఇద్దరు గర్భిణులు ఉన్నారు. 2021 నుంచి ఆయా లేదు. అప్పటి నుంచి కేంద్రంలో అన్ని పనులు నేనే చేయాల్సి వస్తుంది. ఆయా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. –లక్ష్మికళ, అంగన్‌వాడీ టీచర్,కొరటికల్

## క్లుప్తంగా

### పాముకాటుతో మహిళ మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన కన్నెబోయిన పుష్ప(43) గురువారం తోటి మహిళలతో కలిసి వరి నారు పీకుతుండగా ఆమె కుడి కాలుపై పాము కరిచింది. వెంటనే గ్రామస్తులు పుష్పను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ డి. వెంకటరత్నం తెలిపారు.

### ఐరన్ స్క్రాప్ చోరీ చేసి తరలిస్తుండగా పట్టివేత

మేళ్లచెరువు: సిమెంట్ పరిశ్రమలో ఐరన్ స్క్రాప్ చోరీ చేసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. మేళ్లచెరువు ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి పరిధిలోని సాగర్ సిమెంట్ పరిశ్రమలో ఐరన్ స్క్రాప్‌ను చోరీ చేసి పాత ఇనుము సామాను షాపులో విక్రయించేందుకు ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మేళ్లచెరువు మండలం యర్రగట్టుతండా దారిలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అదేవిధంగా ఐరన్ స్క్రాప్ తరలిస్తున్న మఠంపల్లికి చెందిన వానపట్ల మధు, ఆశోదు దేవా, ఏసుమల్ల మహేంద్ర, రాయకంటి ఫ్రాన్సిస్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

మాడుగులపల్లి: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మాడుగులపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన బొమ్మ రాములు(60) గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎరువుల షాపు ఎదురుగా అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిని దాటుతుండగా.. మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె సైదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

### ఇంజనీరింగ్ అడ్మిషన్లకు రిపోర్టు చేయాలి

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ద్వారా మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో గల కళాశాలలో రిపోర్టు చేయాలని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పానగల్ కళాశాలలో లభించే దరఖాస్తు ఫారంతో పాటు రూ.250 చలానా చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9490565566 (విజయ్‌కుమార్), 9640705745 (వేణుగోపాల్) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# పాడి పరిశ్రమతో విజయపథం

- 18 ఏళ్లుగా పాడి పరిశ్రమ నిర్వహిస్తున్న నడిగూడెం మండలం వాసి
- నిత్యాదాయంతో పాటు ఉపాధి కల్పిస్తున్న పుట్టగుంట చందు

స్ఫూర్తి

నడిగూడెం: రెండు గేదెలతో పాడి పరిశ్రమను ప్రారంభించి గత 18 ఏళ్లుగా నిత్యం ఉపాధి పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి చెందిన పుట్టగుంట చందు. డిగ్రీ వరకు చదువుకున్న చందు 2007లో రెండు పాడి గేదెలతో పాడి పరిశ్రమ ప్రారంభించాడు. నాటి నుంచి నేటి వరకు 20 పాడి గేదెలు, 15 ఆవులతో పాడి పరిశ్రమ కొనసాగిస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నాడు. రెండు పాడి గేదెల ద్వారా వాటి సంతానాన్ని ఉత్పత్తి చేస్తూ నేడు 20 గేదెల వరకు అభివృద్ధి చేసుకున్నాడు. ఇంకా 10 వరకు దూడలు కూడా ఉన్నాయి.



తాను పెంచుతున్న ఆవులతో చందు

#### రోజుకు 180 లీటర్ల పాల దిగుబడి

ఆయనకు ఉన్న 20 పాడి గేదెలు, 15 ఆవుల ద్వారా రోజుకు ఉదయం 80 నుంచి 90 లీటర్లు, సాయంత్రం 70 నుంచి 80 లీటర్ల పాల దిగుబడి తీస్తున్నాడు. పాలను గ్రామానికి చెందిన పలువురికి నేరుగా వాడికల ద్వారా, కోదాడ, ఖమ్మం పట్టణాల్లో ప్రైవేట్ డెయిరీలకు విక్రయిస్తున్నాడు. లీటరు పాలకు రూ.60 నుంచి రూ.70 వరకు ఆదాయం వస్తున్నట్లు ఆయన పేర్కొన్నాడు. ఇద్దరు బిహారీ కూలీలకు ఉపాధి కల్పిస్తూ విజయపథంలో దూసుకెళ్తున్నాడు. పశువులకు ఎండు గడ్డితో పాటు పత్తి చెక్క, వేరుశనగ చెక్క, తవుడు, జొన్న పిండిని ఆహారంగా ఇస్తున్నట్లు చందు చెబుతున్నాడు. నాణ్యమైన పౌష్టికాహారం పెడుతుండడంతో పాల దిగుబడి అధికంగా వస్తుందని ఆయన పేర్కొన్నాడు.

#### ప్రభుత్వం ప్రోత్సహించాలి



గత 18 సంవత్సరాలుగా పాడిపరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నాను. ప్రజలకు, ప్రైవేట్ డెయిరీలకు డైరీలకు స్వచ్ఛమైన పాలను అందిస్తున్నాను. మా లాంటి పాడి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే పాల ఉత్పత్తులు పెంచేందుకు వీలుంటుంది. ప్రత్యేక రుణాలు, పశుగ్రాసం కోసం రాయితీ సౌకర్యం కల్పించాలి.

– పుట్టగుంట చందు, పాడి రైతు

## యూరియా అక్రమ రవాణా నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల: చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ కేంద్రంగా సబ్సిడీ యూరియా అక్రమ రవాణాకు పాల్పడిన ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి పేర్కొన్నారు. చిట్యాల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులకు నిందితుల వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన వాసుదేవ్ శంకర్‌యాదవ్ వెలిమినేడు గ్రామ పరిధిలో గత కొంతకాలంగా దాబా నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా అదనపు ఆదాయం పొందేందుకు గాను గత ఆరు నెలలుగా వెలిమినేడు గ్రామానికే చెందిన టేకుల అంజిరెడ్డికి చెందిన స్థలంలో గోదాం ఏర్పాటు చేసి బీఎస్–6 వాహనాల్లో అదనపు మైలేజీ కోసం ఉపయోగించే డీఈఎఫ్(డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్) తయారు చేస్తున్నాడు.

**గోదాంలో డీఈఎఫ్ తయారీ..**

ఈ గోదాంలో పరిశ్రమల శాఖ ద్వారా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా డీఈఎఫ్ తయారీ యూనిట్ ఏర్పాటు చేశాడు. యూరియా 33 శాతం, నీరు 66 శాతం ఉపగియోగించి డీఈఎఫ్ తయారు చేస్తున్నారు. ఇందులో సబ్సిడీయేతర యూరియాను వినియోగించడంతో అధిక లాభాలు రావడంలేదని, వ్యవసాయ పొలాల్లో వినియోగించే సబ్సిడీ యూరియాను కొందరి వద్ద కొనుగోలు చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో వెలిమినేడు గ్రామానికి చెందిన గోలి శంకరయ్య ద్వారా వెలిమినేడు పీఏసీఎస్ ద్వారా ఇటీవల కాలంలో రైతుల పేరున తీసుకున్న సబ్సిడీ యూరియాను కొనుగోలు చేసి డీఈఎఫ్ తయారు చేస్తూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంటర్‌లో బీఎస్–6 వాహనాలకు విక్రయిస్తూ వస్తున్నాడు. వెలిమినేడు గ్రామంలో యూరియా కొరత ఏర్పడుతుండటంతో పోలీసులు గోదాంపై దాడి చేసి అక్రమంగా తయారవుతున్న డీఈఎఫ్‌ను పట్టుకున్నారు. 70 బస్తాల సబ్సిడీ యూరియా బస్తాలతో పాటు బోలేరో వాహనం, ఆటోను సీజ్ చేశారు. చిట్యాల మండల వ్యవసాయాధికారి గిరిబాబు ఫిర్యాదు మేరకు వాసుదేవ్ శంకర్‌యాదవ్‌తో పాటు అతడికి సహకరించిన గోలి శంకరయ్య, దుర్గయ్య, వినోద్‌కుమార్, రాజీవ్ రాయ్, రోషన్‌కుమార్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ నాగరాజు, ఎస్‌ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు వెంకట్, ఖలీం, సాయి గణేష్, జాన్‌రెడ్డి, వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.

## మట్టపల్లిలో నృసింహుని నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌లో పోలీసుల పటిష్ట బందోబస్తు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నుంచి గురువారం కూడా 26 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో ట్రాఫిక్ జాం, సమ్మక్క సారక్క వద్ద పర్యాటకులు వాహనాలు నిలిపి జలాశయంలోకి దిగుతున్నారని ప్రచురించగా.. గురువారం కొత్త బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం కాకుండా, దయ్యాల గండి వద్ద పర్యాటకులు వాహనాలు నిలిపి జలాశయంలోకి వెళ్లకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. సమ్మక్క సారక్క దగ్గర నుంచి కృష్ణానది తీరం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను సైతం అధికారులు తొలగించారు. అంతేకాకుండా దయ్యాల గండి సమీపంలోని పర్యాటకులు పుష్కరఘాట్‌లోకి దిగకుండా చుట్టూ ట్రెంచ్ కొట్టారు. ఎక్కడికక్కడ పర్యాటకుల వాహనాలను పోలీసులు వరుస క్రమంలో పెట్టిస్తుండటంతో గురువారం ఎక్కడా కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగలేదు.

## యాదగిరిగుట్టపై ఆండాళ్ సదనం గదుల పరిశీలన



ఆండాళ్ సదనం గదులను పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంకు చెందిన ఆండాళ్ సదనం గదులను ఆలయ ఈఓ వెంకట్రావ్ గురువారం పరిశీలించారు. యాదగిరిగుట్ట పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆలయ అద్దె గదులు నిరుపయోగంగా ఉన్నాయని తెలుసుకుని స్వయంగా వెనాయన పరిశీలించారు. గదుల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసి భక్తుల కోసం వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈఓ రమేష్‌బాబు, సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు తదితరులు ఉన్నారు.

# వైద్యం కోసం వెళ్లి అనంతలోకాలకు..

- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజాపేట మండలం బసంతాపురానికి చెందిన రైతు మృతి
- డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి బంధువుల ఆందోళన
- జనగామ జిల్లా కేంద్రంలో ఘటన



ఆస్పత్రి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

జనగామ, రాజాపేట: వ్యవసాయ పొలంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతు వైద్యం కోసం వచ్చి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ ఘటనకు వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగింది. రాజాపేట ఎస్‌ఐ అనిల్‌కుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బసంతాపురం గ్రామానికి చెందిన రైతు ఎం. ప్రభాకర్‌రెడ్డి(47) గత నెల 26న ట్రాక్టర్‌తో వ్యవసాయ పొలం దున్నుతుండగా.. విద్యుత్ తీగ తెగి ట్రాక్టర్ వెనుక కల్టివేటర్‌పై పడింది. దీంతో ప్రభాకర్‌రెడ్డి ట్రాక్టర్ పైనుంచి దూకే ప్రయత్నం చేయగా.. అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అతడి రెండు కాళ్ల పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు వెంటనే జనగామలోని అజంతా ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ బాలాజీ పరీక్షించి.. ప్రభాకర్‌రెడ్డి కాలుకు ఇన్‌ఫెక్షన్ ఉందని, తగ్గే వరకు సర్జరీ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బుధవారం ఇంటికి తీసుకెళ్లాలని చెప్పగా పరిస్థితి విషమంగా ఉంటే ఎలా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు సదరు వైద్యుడిని నిలదీయగా ఆస్పత్రిలోనే ఉండమన్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ప్రభాకర్‌రెడ్డి మృతిచెందాడు. దీంతో డాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రభాకర్‌రెడ్డి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. కాలు ఇన్‌ఫెక్షన్‌కు గురైతే మరో ఆస్పత్రికి రెఫర్ చేయకుండా, ఐదు రోజులుగా ఆ ఆస్పత్రిలోనే ఉంచుకోవడంతోనే పరిస్థితి విషమించి ప్రభాకర్ రెడ్డి మృతిచెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఈ ఘటనపై డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. పేషెంట్‌కు షుగర్, వీడీఆర్‌ఎల్ పాజిటివ్, ఇన్‌ఫెక్షన్, మోకాళ్ల వాపులు ఉండడంతో తగ్గే వరకు సర్జరీ వాయిదా వేసినట్లు చెప్పారు. అంతలోనే గుండెపోటుతో మృతి చెందాడని, ఇందులో తమ తప్పులేదని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు దహనం కేసులో ఇద్దరి రిమాండ్

- నిందితులపై రౌడీ షీట్ ఓపెన్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు గురువారం వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను గురువారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య విలేకరులకు వెల్లడించారు. తడకమళ్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద గత నెల 23న అర్ధరాత్రి పార్కింగ్ చేసిన మిర్యాలగూడ డిపోకు చెందిన నైట్ హాల్ట్ బస్సుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో.. బస్సు కండక్టర్ సీహెచ్. బాలకృష్ణ మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తడకమళ్ల గ్రామానికే చెందిన కుసుమ సుదర్శన్‌రెడ్డి, తంగెళ్ల జానకిరెడ్డి కలిసి డీజిల్‌ను బస్సు లోపల చల్లి నిప్పు పెట్టినట్లు పోలీసులు విచారణలో తేలడంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సుదర్శన్‌రెడ్డిపై 8 కేసులు, తంగెళ్ల జానకిరెడ్డిపై ఐదు కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సుదర్శన్‌రెడ్డి, జానకిరెడ్డిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ప్రధానార్చకుడి ఉద్యోగ విరమణ

- ఘనంగా సత్కరించిన ఈఓ, అర్చకులు, అధికారులు



ప్రధానార్చకుడు నల్లంథీఘల్ నరసింహాచార్యులును సన్మానిస్తున్న ఈఓ వెంకట్రావ్ తదితరులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకులుగా విధులు నిర్వహిస్తున్న నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకట్రావ్‌తో పాటు ఆలయ అర్చకులు, అధికారులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్వామివారికి ఆయన చేసిన సేవలను ఆలయ ఉద్యోగులు గుర్తుచేసుకున్నారు. పాత ఆలయం నుంచి ఆలయ పునర్నిర్మాణం వరకు ఆయన చేసిన సేవలు మరువలేనివని స్థానికులు చెబుతున్నారు.

**46ఏళ్ల పాటు సేవలు**

యాదగిరిగుట్ట దేవస్థానంలో ప్రధానార్చకులుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నరసింహాచార్యులు జన్మస్థలం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామం. ఆయన వైదిక విద్యను అభ్యసిస్తూనే ఎంఏ తెలుగు, సంస్కృతం వేద ఆగమాలపై గ్రంథ రచనలు చేసి డాక్టరేట్ పట్టా పొందారు. తొలుత ఈయననల్లగొండ జిల్లా కేంద్రంలోని రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకత్వం చేశారు. అనంతరం 1979 డిసెంబర్‌లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అర్చకుడిగా విధుల్లో చేశారు. కొన్ని సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ఆయనను ఆలయ ప్రధానార్చకులుగా నియమించింది. లక్ష్మీనరసింహుడి సన్నిధిలో 46 సంవత్సరాల పాటు ఆయన తన సేవలు అందించారు.



## జేఎన్‌వీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర: పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ మార్కుల ఆధారంగా ఈ ప్రవేశాలకు అర్హులు అని ఆయన తెలిపారు. విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో లేదా https://navodaya.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును పొందవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలు నింపి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జవహర్ నవోదయ విద్యాలయం నందు అందజేయాలని సూచించారు. పూర్తిగా నింపిన ఫారాన్ని jnvnalgondaxi2526@gmail.com మెయిల్ ద్వారా కూడా పాఠశాలకు పంపవచ్చన్నారు. మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వీలైనంత త్వరగా తమ దరఖాస్తు ఫారాన్ని పాఠశాలకు చేరవేయాలని అన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

## కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి

- మరో 8 గొర్రెలకు గాయాలు

భూదాన్‌పోచంపల్లి: కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం మెహర్‌నగర్ గ్రామంలో జరిగింది. వివరాలు.. మెహర్‌నగర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి తోటకూరి నర్సింహ రోజుమాదిరిగానే బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని గొర్రెల మందలోకి తన గొర్రెలను తోలాడు. అర్ధరాత్రి అటవీప్రాంతం నుంచి కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 10 గొర్రెలు మృతిచెందాయి. మరో 8 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గురువారం ఉదయం గొర్రెల కాపరి నర్సింహ మంద వద్దకు వెళ్లి చూడగా గొర్రెలు మృతిచెంది ఉన్నాయి. సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

## బాలుడిని దండించిన అంగన్‌వాడీ ఆయా

నూతనకల్: అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిని ఆయా కర్రతో దండించిన ఘటన నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామంలో గురువారం జరిగింది. మాచనపల్లి గ్రామానికి చెందిన ములకలపల్లి సైదులు, ప్రశాంతి దంపతుల కుమారుడు జతిన్‌కుమార్‌ను గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ–1 కేంద్రానికి పంపించారు. అంగన్‌వాడీ టీచర్ మండల కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌కు వెళ్లడంతో.. ఆయా జతిన్‌కుమార్‌ను కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో బాలుడు ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. బాలుడి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఆయాను నిలదీయగా.. పొరపాటు జరిగిందని, ఇంకోసారి కొట్టనని సమాధానం ఇచ్చింది. గతంలో కూడా ఆయా పిల్లలను ఇదేవిధంగా కొట్టిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతను వివరణ కోరగా.. ఈ ఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.









**నాడు కళకళ.. నేడు వెలవెల**

చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శ్రీలింగమంతులస్వామి దేవస్థానం వద్ద గల చెరువు గతంలో తామర పువ్వులతో కళకళలాడుతూ కనిపించేది. కానీ ప్రస్తుతం చెరువులో తగినంత నీరు లేకపోవడంతో తామర పువ్వులన్నీ ఎండిపోయి వెలవెలబోయింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



# పోక్సో కేసులో 21ఏళ్లు జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), కట్టంగూర్: బాలికను గర్భవతిని చేసిన వ్యక్తికి 21 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్. రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నార్కట్‌పల్లి మండలం చిప్పలపల్లికి చెందిన వలిగొండ వెంకన్న అలియాస్ చందు బోర్‌వెల్ డ్రిల్లర్‌గా పనిచేస్తున్నాడు. కట్టంగూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఆమెను శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. తనను పెళ్లి చేసుకోవాలని బాలిక కోరగా వెంకన్న నిరాకరించాడు. దీంతో 2018 ఏప్రిల్ 20న కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో బాలిక ఫిర్యాదు చేసింది. వెంకన్నపై అప్పటి ఎస్‌ఐ బి. రంజిత్ కేసు నమోదు చేయగా.. సీఐ క్యాస్ట్రోరెడ్డి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుత సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్ కలిసి విచారణ చేపట్టి పూర్తి నివేదికను కోర్టుకు అందజేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎన్. రోజారమణి వెంకన్నకు 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి పరిహారంగా రూ.10లక్షలు చెల్లించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

### డ్రైవర్‌కు ఏడు నెలలు..

రామగిరి(నల్లగొండ): అతివేగంగా వాహనం నడిపి చిన్నారి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి కె. శిరీష గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆరెగూడెం గ్రామానికి చెందిన నీరుడు జ్యోత్స్న, ఆమె భర్త మధుసూదన్, కుమార్తె అక్షర కలిసి 2016లో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో తుఫాన్ వాహనం ఎక్కి సూర్యాపేటకు వస్తుండగా.. నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్ వద్ద వాహన డ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అక్షర మృతిచెందగా, మిగతా ప్రయాణికులకు గాయాలయ్యాయి. తన కుమార్తె అక్షర మృతికి తుఫాన్ వాహనం డ్రైవర్ రంపకుంట్ల శివకుమార్ కారణమని నీరుడు జోత్స్న నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి శివకుమార్‌ను కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధురి వాదనలతో ఏకీభవించిన జడ్జి కె. శిరీష శివకుమార్‌కు ఏడు నెలల జైలు శిక్ష,రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

### కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలలు..

రామగిరి(నల్లగొండ): కులం పేరుతో దూషించిన వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు రెండవ అదనపు జడ్జి ఎన్. రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన రమావత్ శ్రీనునాయక్, ఏపీలోని గుంటూరుకు చెందిన కొంగంటి సునీల్‌కృష్ణ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేస్తున్నారు. శ్రీనునాయక్ వద్ద 2022లో సునీల్‌కృష్ణ రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. జమానతుగా బ్యాంకు చెక్కు ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బ్యాంకులో చెక్కు డ్రా చేసుకునేందుకు వెళ్లగా బౌన్స్ అయ్యింది. దీంతో సునీల్‌కృష్ణ శ్రీనునాయక్‌ను కులం పేరుతో దూషించాడు. శ్రీనునాయక్ 2024లో వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జవహర్‌లో వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా కోర్టు రెండవ అదనపు కోర్టు జడ్జి రోజారమణి సునీల్‌కృష్ణకు 6 నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.